అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు
- ఖైర్‌గాం గ్రామసభ సందర్శన
- జిల్లా వ్యాప్తంగా 6,186 దరఖాస్తుల స్వీకరణ

ఖైర్‌గాంలో దరఖాస్తుల స్వీకరణను పరిశీలిస్తున్న కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు

దహెగాం: కోత్మీర్ గ్రామసభలో పాల్గొన్న ఆర్డీవో సురేష్‌కుమార్

రెబ్బెన, డిసెంబర్ 29 : సర్కారు ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన ప్రజాపాలన అభయహస్తం గ్యారంటీ పథకాలు అర్హులైన లబ్ధిదారులందరికీ తప్పకుండా అందుతా యని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు పేర్కొన్నారు. మండలంలోని ఖైర్‌గాం గ్రామపంచాయతీలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని పరిశీలించి పలు సలహాలు సూచనలు చేశారు. దరఖాస్తుదారుడు పూర్తి సమాచారం ఫారంలో పొందుపర్చాలని అప్పుడే న్యాయం జరుగుతుందని తెలిపారు. దరఖాస్తు ఫారంతో పాటు ఆధార్, రేషన్‌కార్డుల జిరాక్సు పత్రాలు జతపర్చాలని, దరఖాస్తులు కౌంటర్‌లో అందించిన అనంతరం రసీదు తప్పకుండా తీసుకొవాలని సూచించారు. ఖైర్‌గాం, తుంగెడ గ్రామ పంచాయతీల్లో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ, గ్రామసభలకు అదనపు కలెక్టర్ వేణు(రెవెన్యూ), డీపీవో ఓమర్‌లు హాజరై పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సమీర్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, జడ్పీటీసీ వేముర్ల సంతోశ్, పీఏసీఎస్ చైర్మన్ కార్నాథం సంజీవ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ వరలక్ష్మి, ఎంఈవో వెంకటేశ్వర స్వామి, ఎంపీవో అంజాద్‌పాషా, ఏఈ ఇమ్రాన్, ఏపీఎం రాజ్‌కుమార్, ఏపీవో బుచ్చన్నలతో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డుసభ్యులు, వివిధ శాఖల ఆధికారులు, ఎఈవోలు, పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ సిబ్బంది ఉన్నారు.

• అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

రెబ్బెన, డిసెంబర్ 29 : కాంగ్రెస్ సర్కారు అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందిస్తుందని జిల్లా డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్ లు అన్నారు. మండలంలో కొనసాగుతున్న ప్రజాపాలన అభయహస్తం గ్యారంటీ పథకాల దరఖాస్తుల స్వీకరిస్తున్న పలు గ్రామపంచాయతీల్లో పర్యటించి ఆరు గ్యారెంటీ పథకాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ దుర్గం సోమయ్య, ఎంపీటీసీ రఘుపతి, సర్పంచ్ కార్తీక్, నాయకులు మోడెం సుదర్శన్‌గౌడ్, మోడెం చిరంజీవిగౌడ్, మోడెం రాజాగౌడ్, ఉమేశ్‌గౌడ్ పలువురు ఉన్నారు.

• దరఖాస్తు ఫారాలు అందించాలి

రెబ్బెన, డిసెంబర్ 29: సర్కారు ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన అభయహస్తం ఆరు గ్యారంటీ పథకాల కోసం దరఖాస్తు చేసుకునే ఫారాలు లబ్ధిదారులకు నేరుగా అందించాలని పలువురు కోరుతున్నారు. దరఖాస్తు చేసుకునే లబ్ధిదారులు దరఖాస్తు ఫారాల కోసం కౌంటర్ కేంద్రాల వద్ద ఎగబడుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో, తహసీల్దార్‌ను సంప్రదించగా మండలం మొత్తం 24 గ్రామ పంచాయతీల్లో 94 దరఖాస్తుల స్వీకరణ కౌంటర్‌లు ఏర్పాటు చేశామని ఎంపీడీవో పరికిపండ్ల శ్రీనివాస్, తహసీల్దార్ సమీర్ లు తెలిపారు. దరఖాస్తు ఫారాలు ప్రతి ఒక్క కుటుంబానికి అందేవిధంగా గ్రామపంచాయతీల్లో సిద్ధంగా ఉన్నాయని ఎవరూ బయట జిరాక్సు కేంద్రాల వద్ద తీసుకొవద్దని, గ్రామపంచాయతీ కార్యాలయాల్లో అందించే వాటిని తీసుకొని ఎలాంటి తప్పులు లేకుండా నింపి అందించాలని సూచించారు. జనవరి 6వరకు సమయం ఉందని లబ్ధిదారులు గమనించాలని ఒక్కసారిగా గుంపులుగా రావద్దని క్యూలో వచ్చి ఫారాలు తీసుకొని ఆధార్, రేషన్‌కార్డులు జత చేసి కౌంటర్‌లో అందించి తప్పకుండా రసీదు పొందాలని సూచించారు.

• ప్రజాపాలన పకడ్బందీగా చేపట్టాలి

ఆసిఫాబాద్ టౌన్ ,డిసెంబర్ 29 : రాష్ట్ర ప్ర భుత్వం ఏర్పాటు చేసిన ప్రజాపాలన దరఖాస్తుల కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ అన్నారు. శుక్రవారం మండలంలోని దాంపూర్, చిర్రకుంట,సాలెగూడ, ఎల్లారం గ్రామాలతో పాటు ఆసిఫాబాద్ టౌన్‌లో చేపట్టిన ప్రజాపాలన దరఖాస్తుల కార్యక్రమాన్ని ఎంపీపీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలన కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన లబ్ధిదారుల అందరికీ ప్రభుత్వం అందించే గ్యారంటీ పథకాలను అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యుటీ తహసీల్దార్ పోచ య్య, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీడీవో శశికల, ఎంపీవో ప్రసాద్, డీపీవో ఉమర్ ఏపీవో చంద్రశేఖర్ ఆసిఫాబాద్ గ్రామపంచాయతీ కార్యదర్శి నాంపల్లి వంశీకృష్ణ ఎంపీటీసీలు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

• దరఖాస్తులను స్పష్టంగా నింపాలి

దహెగాం,డిసెంబర్ 29 : ప్రజాపాలన కార్యక్రమంలో పెట్టుకుంటున్న అభయ హస్తం దరఖాస్తులను స్పష్టంగా నింపాలని ఆర్డీవో సురేశ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని బీబ్రా,కోత్మీర్, బామన్‌నగర్, చంద్రపల్లి గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించగా కోత్మీర్ గ్రామసభలో ఆర్డీవో పాల్గొని మాట్లాడుతూ ముఖ్యంగా దరఖాస్తులో రేషన్, ఆధార్, మోబైల్ నంబర్లను జాగ్రత్తగా తప్పులు లేకుండా నింపాలన్నారు. అదేవిధంగా దరఖాస్తు ఫారాలను కూడా ప్రభుత్వం అందిస్తుందని ఎవరికి డబ్బులు ఇవ్వకూడదని పేర్కొన్నారు. ఈ గ్రామ సభల్లో తహసీల్దార్ కవిత, ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్, సర్పంచ్‌లు బండ కృష్ణమూర్తి, తరున్నం సుల్తాన, లగ్గాం దామోదర్, అధికారులు పాల్గొన్నారు.

• రెండో రోజు దరఖాస్తుల స్వీకరణ

సిర్పూర్(టీ), డిసెంబర్ 29 : మండలంలోని గ్రామాల్లో రెండో రోజు ప్రజా పాలన ధరఖాస్తులను అధికారులు ప్రజల వద్ద నుంచి స్వీకరించారు. శుక్రవారం మండలకేంద్రంలోని రైతు వేదికలో దరఖాస్తుల స్వీకరణ కేం ద్రాన్ని మండల ప్రత్యేకాధికారి డీఎల్‌పీవో రమేశ్‌బాబు పరిశీలించి, ప్రజల వద్ద నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అదేవిధంగా టోంకిని, లోనవెల్లి గ్రామాల్లో ఎంపీడీవో రాజేశ్వర్, నవేగాం హడ్కులీ గ్రామాల్లో తహసీల్దార్ శ్రీనివాస్‌లు దరఖాస్తులను స్వీకరించారు.

• పథకాలను వినియోగించుకోవాలి

వాంకిడి,డిసెంబర్ 29: అర్హులైన లబ్ధిదారులందరూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మండల అభివృద్ధి అధికారి సూచించారు. రెండో రోజు ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా మండలంలోని నవేదరి గ్రామపంచాయతీలో స్థానిక సర్పంచ్ అధ్యక్షతన శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా మండల అభివృద్ధి అధికారి పాల్గొని గౌరవ ముఖ్యమంత్రి సందేశాన్ని గ్రామ ప్రజలకు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభు త్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలనలో 6 గ్యారెంటీ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని,ప్రతి కు టుంబం ఈపథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధిహామీ ఏపీవోశ్రావణ్,ఎలక్ట్రిసి టీ విభాగ ం నుంచి సౌమ్య శ్రీ,ఎడ్యుకేషన్ డి పార్ట్‌మెంట్ నుంచి గణపతి, కార్యదర్శి,గ్రామస్తులు పాల్గొన్నారు.

• ప్రతిరోజూ దరఖాస్తులు స్వీకరిస్తాం

పెంచికల్ పేట్,డిసెంబర్29 : 5 గ్యారెంటీలకు సంబంధించి ప్రతి గ్రామపంచాయతీలో 6తేదీ వరకు ప్రతిరోజూ దరఖాస్తుల స్వీకరిస్తామని తహసీల్దార్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఎల్లూరు లోడ్పల్లి గ్రామపంచాయతీల్లో ప్రజాపాలన ప్రత్యేక గ్రామసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తు ఫారంతో పాటు రేషన్‌కార్డ్ ,ఆధార్‌కార్డు జత పరిస్తే సరిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ రామకృష్ణ, సర్పంచ్‌లు దుర్గం రాజన్న, జాజిమొగ్గ శ్రీనివాస్, మండల కోఆప్షన్ సభ్యుడు సాజిత్,ఎస్సై కొమురయ్య, ఆర్ఐ సురేశ్ పాల్గొన్నారు.

• కొనసాగుతున్న ప్రజాపాలన

కెరమెరి, డిసెంబర్ 29: మండలంలోని 31 గ్రామపంచాయతీల్లో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతున్నది. ప్రజాపాలన టీం అధికారులుగా ఎంపీడీవో మహేందర్, డిప్యూటీ తహసీల్దార్ రాజలింగు వ్యవహరిస్తున్నారు. జీపీల్లో పంచాయతీ కార్యదర్శితో పాటు ఇతర శాఖల సిబ్బంది 6 గ్యారంటీలపై పూర్తి వివరాలతో దరఖాస్తులు స్వీకరిస్తూ లబ్ధిదారులకు రసీదులు అందించారు.

• చింతలమానేపల్లిలో..

చింతలమానేపల్లి, డిసెంబర్ 29: మండలంలోని అన్ని గ్రామాల్లో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం కొనసాగుతున్నది. శుక్రవారం రణవెల్లి, బూరెపల్లి గ్రామాల్లో మండల ప్రత్యేక అధికారి కుటుంబరావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇప్పటికే మండల వ్యాప్తంగా రెండు రోజుల్లో 2,892 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి తెలిపారు. కొన్ని గ్రామాల్లో అధికారులు దరఖాస్తులు తీసుకుని రసీదు ఇవ్వలేదన్నారు. మండల ప్రత్యేక అధికారి కుటుంబరావు, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, తహసీల్దార్ మస్కుర్ అలీ, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

వాంకిడి: ధన్‌రాజ్ అరెస్ట్‌ను చూపుతున్న సీఐ శ్రీనివాస్,ఎస్ఐ విజయ్

వాంకిడి, డిసెంబర్ 29 : కెరమెరి మండలం కోటా గ్రామంలో 6 కేజీల, 100గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వాంకిడి సీఐ బి.శ్రీనివాస్, వాంకిడి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ, కెరమెరి మండలంలోని కోటా గ్రామంలో ఈ నెల 28న గంజా యి నిల్వ ఉన్నదనే పక్కా సమాచారంతో కెరమెరి ఎస్సై విజయ్ సిబ్బందితో కలిసి దాడు లు నిర్వహించగా ధన్‌రాజ్ ఇంటిలో అక్రమంగా నిల్వ ఉంచిన 6 కేజీల 100గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దీని విలువ సుమారు రూ.1లక్షా 52వేలు ఉంటుందన్నారు. నిందితుడిని అరెస్టు చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు.

• గంజాయి మొక్కల స్వాధీనం

జైనూర్ డిసెంబర్ 29: మండలంలోని బాబుల్‌గూడ గ్రామంలో ఆత్రం తుకారాం అనే రైతు తన చేనులో 14 గంజాయి మొక్కలు నాటినట్లు ఎస్సై సందీప్ కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన గంజాయి మొక్కలను ధ్వంసం చేసి ఆత్రం తుకారాం అనే రైతుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్‌సిబ్బంది మండల రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సిక్‌లీవ్ పెంచుతూ సర్క్యులర్ జారీ

గోలేటి టీబీజీకేఎస్ కార్యాలయంలో మాట్లాడుతున్న టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు

రెబ్బెన, డిసెంబర్ 29: జేబీసీసీఐలో జరిగిన ఒప్పందాలకు అనుగుణంగా సింగరేణిలో సిక్‌లీవ్ అమలు చేస్తూ సర్క్యులర్ జారీ చేయాలని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు కోరారు. బెల్లంపల్లి ఏరియాలోని గోలేటిటౌన్‌షిప్‌లో గల టీబీజీకేఎస్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జేబీసీసీఐ ఒప్పందంలో కార్మికులకు సిక్ లీవ్ నిల్వ 120 నుంచి 150కి పెంచారని, దానికి అనుగుణంగా సింగరేణిలో కొత్త సంవత్సరం నుంచి అమలు చేస్తూ సర్క్యులర్ జారీ చేయాలన్నారు. ఈ నెల 31తో సంవత్సరం మారుతున్నందున్న కొత్త సంవత్సరంలో వచ్చే 15 సిక్ లీవ్‌లు వృథా అయ్యే అవకాశం ఉందని కార్మికులు అందోళన చెందుతున్నారని తెలిపారు. ఎల్‌టీసీ, ఎల్ఎల్‌టీసీలను పెరిగిన రేటు రూ.12వేలకు బదులు రూ.15వేలు చెల్లించే విధంగా సర్క్యులర్ జారీ చేయాలని కోరారు. ఉద్యోగి భార్య డెలివరీ అయినప్పుడు సింగరేణి ఉద్యోగికి ఇచ్చే మెటర్నిటి లీవ్ అమలు చేస్తూ సర్క్యులర్ జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ మాజీ ఉపాధ్యక్షుడు నల్లగొండ సదాశివ్, నాయకులు మాంతు సమ్మయ్య, ఓరం కిరణ్ ఉన్నారు.

బాల్య మిత్రుడికి ఆర్థికసాయం

రమేశ్‌కు నగదును అందజేస్తున్న బాల్య మిత్రులు

బెజ్జూర్, డిసెంబర్ 29 : మండలంలోని కుకుడ గ్రామానికి చెందిన కొట్రంగి రమేశ్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న తన బాల్యమిత్రులు తన ఇంటికి వెళ్లి వైద్య ఖర్చుల నిమిత్తం తనకు రూ.10 వేలు అందజేశారు. రమేశ్ త్వరగా కొలుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చాకటి శ్రీధర్, నామని రాజలింగు, రంగు సురేశ్ గౌడ్, గోరెంటల సంతోశ్, కావుడె రాజు, అహ్మద్, పాల్గొన్నారు.

నేడు కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

బెజ్జూర్, డిసెంబర్ 29 : మండల కేంద్రంలో శనివారం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దారు భూమేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మండల ప్రజా ప్రతినిధులు, లబ్ధిదారులు తదితరులు హాజరు కావాలని తహసీల్దారు కోరారు.

పతంగులకు మాంజదారం వాడొద్దు

పెంచికల్‌పేట్,డిసెంబర్29 : పతంగులకు మాంజదారం వినియోగించవద్దని ఎఫ్‌బీవో అరుణ్ రెడ్డి అన్నారు. శుక్రవారం అగర్‌గూడ గ్రామ పిల్లలకు పతంగుల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా ముందస్తు సంబురాల్లో భాగంగా యువత, పిల్లలు పతంగులు ఎగరవేసేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని ముఖ్యంగా మాంజదారం వినియోగించకుండా సాధారణ దారాలను వాడుకోవాలని సూచించారు. మాంజ దారంతో స్వేచ్ఛగా తిరిగే పక్షులకు హాని కలుగుతుందని ఆయన తెలిపారు.

దైవదర్శనానికి తరలిన ఆదివాసీలు

కెరమెరి, డిసెంబర్ 29 : మండలంలోని పిట్టగూడ గ్రామానికి చెందిన కొలాం ఆదివాసీలు భీమదేవరతో శుక్రవారం తలండికి తరలివెళ్లారు. భీమదేవుని పుణ్యక్షేత్రం మహారాష్ట్రలోని తలండిలో ఉండడంతో దేవుని దర్శించేందుకు కాలినడకన తరలివెళ్లారు. మొక్కులు తీర్చుకున్న అనంతరం తిరిగి గ్రామా నికి చేరుకుంటామని గ్రామపెద్దలు తెలిపారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలి

దహెగాం,డిసెంబర్ 29: కొంచవెల్లి గ్రామంలో వ్యక్తిగత మరుగుదొడ్లకు చెందిన నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టి అసలైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని కొంచవెల్లి గ్రామానికి చెందని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం పేద ప్రజలకోసం స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయగా కొందరు నాయకులు అధికారులు కుమ్మక్కై బినామీ పేర్లతో నిధులను దుర్వినియోగం చేసినట్లు ఆరోపించారు. ఉన్నతాధికారులు వెంటనే విచారణ చేపట్టాలని కోరారు. మామిడి భీమేశ్, సాయికృష్ణ, సంతోష్, కాసనగొట్టు వెంక న్న, చప్పిడ సంజీవ్, మల్లేశ్ పాల్గొన్నారు.

ఎన్నికల ఖర్చుల వివరాలందించాలి

- కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు

ఆసిఫాబాద్ టౌన్ : సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు

ఆసిఫాబాద్ టౌన్, డిసెంబర్ 29 : ఇటీవల నిర్వహించిన శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు తమ ఖర్చుల పూర్తి వివరాలను అందించాలని కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఎన్నికల ఖర్చుల పరిశీలకుడు అనునై భాటియాతో కలిసి శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, ఏజెంట్లు, సహాయ వ్యయ పరిశీలకులు, ఎన్నికల విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా పోటీలో ఉన్న అభ్యర్థులు, ఆయా రాజకీయ పార్టీలు ప్రచారం కోసం చేసిన ఖర్చులను పూర్తిస్థాయిలో అందించాలని తెలిపారు. జిల్లాలోని సిర్పూర్ నియోజకవర్గంలో 13 మంది, ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 17 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారని, వీరందరూ తమ ఖర్చుల వివరాలను రెండు రోజుల్లోగా సహాయ వ్యయ పరిశీలకులు, అకౌంటింగ్ కమిటీకి అందించాలని కోరారు. ఇట్టి వివరాలను భారత ఎన్నికల సంఘానికి పంపించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం అధికారులు, అభ్యర్థులు, ఏజెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సిర్పూర్(యు):ఎమ్మెల్యే కోవ లక్ష్మిని సన్మానిస్తున్న మండల నాయకులు

ఎమ్మెల్యేకు సన్మానం

సిర్పూర్(యు) డిసెంబర్ 29 : అసెంబ్లీ ఎన్నికలల్లో ఎమ్మెల్యే కోవ లక్ష్మి భారీ మెజార్టీతో గెలుపొందడం చాలా సంతోషంగా ఉందని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తొడసం ధర్మరావ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో కోవ లక్ష్మిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. ఆయనతో పాటు పంగిడి రాయిసెంటర్ సర్మేడి ఆత్రం మక్తుర్‌షావ్, సర్పంచ్ కురుకుటె పర్లాద్, ఉపసర్పంచ్ గజానంద్ తదితరులు ఉన్నారు.

అదృశ్యమైన ఒకరి మృతదేహం లభ్యం

బెజ్జూర్, డిసెంబర్ 29 : అదృశ్యమైన వ్యక్తి బావిలో పడి మృతి చెందినట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు. మండలంలోని బారెగూడ గ్రామానికి చెందిన డబ్బ సురేశ్ (45)ఈనెల 25న తన ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమయ్యాడు. సురేశ్ కుటుంబసభ్యులు తన కోసం ఎంతవెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మూడు రోజులగా గాలింపు చర్యలు చేపడుతున్న క్రమంలో గ్రామానికి చెందిన తొగరి తిరుపతి బావిలో దుర్గంధం వెదజల్లడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సురేశ్ గత కొద్ది రోజులుగా తాగుడుకు బానిసై మతిస్థిమితం లేకుండా తిరుగుతూ బావిలో పడిపోయి మృతిచెందినట్లు మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

నేడు సామాజిక తనిఖీ

దహెగాం,డిసెంబర్29 : మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనులపై శనివారం మండల కేంద్రం లో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఏపీవో కల్పన తెలిపారు. 2022,2023 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులపై క్షేత్రస్థాయిలో సామాజిక తనిఖీలు చేట్టినట్లు ఆమె పేర్కొన్నారు. మండలస్థాయిలో శనివారం ప్రజావేదిక చేపడుతున్నట్లు ఈ వేదికకు సంబంధిత అధికారులు, కూలీలు హాజరు కావాలని కోరారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

లింగాపూర్: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఆడే సవిత

లింగాపూర్, డిసెంబర్ 29: మండలకేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ ఆడే సవిత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు అధికారులు సమయపాలన పాటించి గ్రామాల్లో మిషన్ భగీరథ నీళ్లు రాక ఇబ్బందులు పడుతున్న వారికి నీటి సాకర్యం కల్పించాలని మిషన్ భగీరథ అధికారులకు సూచించారు. ఇక్కడ వైస్ ఎంపీపీ ఆత్మరాం, ఎంపీటీసీలు సర్పంచ్‌లు ఎంపీడీవో ప్రసాద్ తహసీల్దార్ ప్రసాద్‌వర్మ పాల్గొన్నారు.

కార్మికులకు అండగా ఐఎన్‌టీయూసీ

ఖైర్‌గూడ ఓసీపీలో మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్

రెబ్బెన, డిసెంబర్ 29: సింగరేణి కార్మికులకు అండగా ఐఎన్‌టీయూసీ యూనియన్ ఉంటుందని సంఘం బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్, సీనియర్ నాయకుడు సంగెం ప్రకాశ్‌రావులు స్పష్టం చేశారు. బెల్లంపల్లి ఏరియాలోని ఖైర్‌గూడ ఓసీపీలో పర్యటించి కార్మికులను కలిసి ఐఎన్‌టీయూసీ యూనియన్‌కు గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఓటు వేసి మంచి మెజార్టీ అందించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపి మాట్లాడారు. కార్మికుల సమస్యలపై తమ సంఘం నిరంతరం పొరాటం చేస్తుందని, అవసరం అయితే ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఏరియా సెక్రటరీ మాధవకృష్ణ, నాయకులు సంజీవరెడ్డి, మసాడి నారాయణ, వామన్, స్వామి, ప్రభాకర్, కందుల తిరుపతి, సర్వేజ్, గోడ తిరుపతి ఉన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో బస్సు సౌకర్యం కల్పించాలి

కెరమెరి: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పెందోర్ మోతీరాం

కెరమెరి, డిసెంబర్ 29: గ్రామీణ ప్రాంతంలోని ప్రజలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ఎంపీపీ పెందోర్ మోతీరాం కోరారు. శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించిన్నప్పటికీ బస్సులు నడపకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ముందుగా మండల వ్యవసాయాధికారి గోపికాంత్ మాట్లాడుతూ, యాసంగి సాగు కోసం ప్రభుత్వం ఇప్పటి వరకు 470 మంది రైతులకు పెట్టుబడి సాయం అందించిందని, మరో 6 వేలకు పైగా రైతులకు రైతుబంధు అందించాల్సి ఉందని సభకు వివరించారు. కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం రైతు భరోసా కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారని, గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన పోడుభూముల పట్టాలు ఆన్‌లైన్‌లో ఉన్నందున లబ్ధిదారులు ఆ వివరాలు ఎలా నమోదు చేస్తారని ఝరి సర్పంచ్ కుమ్రం నాణేశ్వర్ ప్రశ్నించారు. దీంతో ఏవో ఏఈవోలు లేదా కార్యదర్శుల నుంచి వివరాలు సేకరించి నమోదు చేయాలని చెప్పారు. ఉపాధిహామీ పథకం ద్వారా రాబోయే ఏడాదికి కావాల్సిన పనులను గ్రామసభలో గుర్తించి నివేదిక అందించాలని ఏపీవో మల్లయ్య కోరారు. మోడి కేజీబీవీ, ఆశ్రమ పాఠశాలలో కోతుల బెడద పెరిగిందని అటవీశాఖ అధికారులు నివారణ చర్యలు చేపట్టాలని జడ్పీటీసీ సెడ్మాకి దుర్పతాబాయి తెలిపారు. ముకదాంగూడలో సెల్‌ఫోన్ టవర్ మంజూరు కాగా అటవీ ఖ అధికారులు ఎందుకు అభ్యంతరం చెపుతున్నారని ఆ పంచాయతీ సర్పంచ్ లింబాదాస్ ప్రశ్నించారు. ఈ విషయంపై స్పందిస్తూ సెల్ టవర్ నిర్మాణం కోసం జాయింట్ సర్వే పూర్తయ్యిందని, కోతుల బెడదపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఎఫ్‌బీవో నజీర్‌అలీ చెప్పారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యాధికారులతో పాటు సిబ్బంది పోస్టులు ఖాళీలున్నాయని ఇన్‌చార్జి వైద్యాధికారితో వైద్యసేవలు అందిస్తున్నామని సీహెచ్‌వో శ్రీనివాస్‌రెడ్డి సభ దృష్టికి తీసుకొచ్చారు. అంగన్‌వాడీ సెంటర్‌లలో గుడ్ల పంపిణీ సక్రమంగా సరఫరా కావడం లేదని క